# పెళ్ళి చేసుకుంటుంటే చూడు

సూత మహాముని నదిలో స్నానం, సంధ్యావందనం పూర్తి చేసి బయటకువచ్చి, అంగవస్త్రాన్ని పక్కనే వున్న బండరాయి మీద ఆరేస్తుండగా, "గురువుగారికి నమస్కారం" అన్నమాట వినపడింది.

ఆయన వెనక్కి తిరిగి చూడగానే, చిన్నముని ఆయనకి రెండు చేతులూ జోడిస్తూ కనపడ్డాడు.

"ఏం నాయనా! కుశలమే కదా?" అని అడిగాడు సూత మహాముని.

"కుశలమే మునివర్యా! కాకపోతే ఎందుకో గత రాత్రి నాకు నిద్ర పట్టలేదు" అన్నాడు చిన్నముని.

సూతుడు ఒకసారి తడిసిన గడ్డాన్ని నిమురుకుని చిన్నముని మనసులోకి తొంగి చూసి "ఎందుకో నాకు అర్థమయిందిలే!" అన్నాడు.

చిన్నముని సిగ్గుపడి "మీకు తెలిసిపోయిందా.. మరీ.. మరీ.." అంటుండగా సూత మహాముని చిరునవ్వు నవ్వి "ఏమీ ఫరవాలేదు నాయనా. ఈ రోజు నేను ప్రేమ కథ చెబుతానని కొంచెం ఆందోళనలో వున్నావు. అది మానవ సహజం. కొంచెం నిగ్రహం చూపించు. భౌతిక విషయాల వెనుక దాగిన ఆ ఆధ్యాత్మిక సూత్రాల్ని చూడటం అలవాటు చేసుకో. మునివర్యుడివవుతావు" అన్నాడు.

చిన్నముని ఇంకొంచెం సిగ్గుపడి "అదే నా ప్రయత్నం గురువుగారూ" అన్నాడు

"పద. మనవాళ్ళందరూ వచ్చే సమయయింది" అని ముందుకు కదిలాడు సూత మహాముని.

వాళ్ళిద్దరూ మర్రిచెట్టు క్రింద రచ్చబండ దగ్గరకి వచ్చేసరికి, శౌనకాది మునుల తోనూ, నైమిశారణ్యంలోని జంతుజాలంతోనూ ఆ ప్రదేశం నిండుగా వుంది.

"ఈ రోజు మీరు వేణు సిండీలు ఎలా ప్రేమించుకున్నారు, ఎలా పెళ్ళి చేసుకున్నారనే కథ చెబుతామన్నారు. ఆ కథ వినటానికి నేను రాత్రికి కూటికి గూటికి కూడా వెళ్ళకుండా ఇక్కడే ఈ కొమ్మ మీద కూర్చున్నాను. ఆ కథ చెప్పరూ" అని అడిగింది చెట్టు మీది రామచిలుక.

"ఆ కథే చెబుతారివాళ. నువ్వేం గుర్తు చేయనఖ్ఖర్లేదు" అని మందలించాడు శుకమహర్షి చిలుక భాషలో.

"చెబుతాను.. ఆ కథే చెబుతాను.." అన్నాడు సూతుడు సాలోచనగా.

అందరూ నిశ్శబ్దంగా కథ వినటానికి సిద్ధంగా కూర్చున్నారు.

సూతుడు, శౌనకాది మునులకీ, చెవులు రిక్కించుకు కూర్చున్న సర్వజంతు జాలానికీ కథ చెప్పటం ప్రారంభించాడు.

"వేణు యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఇంజనీరింగ్ చదివేటప్పుడు, సిండీ అదే యూనివర్సిటీలో కల్చరల్ ఏంథ్రపాలజీలో డిగ్రీ కోర్సు చేస్తుండేది. సిండీ తన ప్రాజెక్ట్ వర్క్ కోసం, కొంతమందితో ఇంటర్వ్యూలు చేసి పేపర్ వ్రాయవలసివచ్చింది. ఆ సందర్భంగా సిండీ వివిధరకాల సంస్కృతులతో సంబంధంవున్న వాళ్ళని ఎన్నుకుని తన ప్రాజెక్ట్ మొదలు పెట్టింది. వేణుతో మాటలతో ప్రారంభించిన ఆ ప్రాజెక్ట్..."

సూతుడి మాటలకు అడ్డం వస్తూ చిన్నముని అన్నాడు. "రోడ్డు మీద పాటలు పాడే దాకా పోయిందా?"

శౌనకుడు చిన్నముని వేపు చిరుకోపంతో చూసి "ఇది బాలీవుడ్ సినిమాకాదు. అలా రోడ్డుమీద పాటలు పాడుతూ డాన్సులు చేయటానికి. నిజ జీవితం. అలా నడిరోడ్డు మీద పాటలు పాడుతూ, పిచ్చి గంతులు వేస్తుంటే, ముష్టివాళ్ళనుకుని రూపాయిలూ, చిల్లర డబ్బులూ వేస్తారు" అన్నాడు.

చిన్నమునికి, అమెరికాలో రూపాయ లేమిటి డాలర్లేమో అని అనుమానం వచ్చి అడగబోయాడు కానీ.... ఆయన కోపం చూసి మళ్ళీ మాట్లాడలేదు.

"వేణుతో మామూలుగా ప్రారంభించిన ఆ ప్రాజెక్ట్ సాంస్కృతిక పరంగా చర్చల్లోకి దిగింది. అప్పుడే సిండీకి భారతదేశ చరిత్ర మీద ఎంతో ఆసక్తి కలిగింది. వేణు అమెరికాలో పుట్టి పెరిగినవాడు కనుక, తనకి తెలిసిందేదో చెప్పి మిగతా వివరాల కోసం సిండీని తన తల్లిదండ్రులకి పరిచయంచేశాడు. సిండీ వీలున్నప్పుడల్లా వీళ్ళ ఇంటికొచ్చి రకరకాల విషయాల మీద ప్రశ్నలడగటం,చర్చించటం చేసేది. అనంతరామయ్య అన్నీ వివరంగా చెప్పేవాడు. జానకికిమొదట్లో ఇదేదో రెండు రోజుల వ్యవహారంలాగా కనపడినా, తర్వాత సిండీ చూపిస్తున్న ఆసక్తికీ ఆమెలో కనిపించే ఆ నిజాయితీకి ముగ్ధురాల

యింది. సిండీకి చక్కటి తెలుగు భోజనం కూడా వండి పెడుతుండేది.

ఒకరోజు యూనివర్సిటీ దగ్గరలోవున్న మెక్సికన్ రెస్టారెంటులో డిన్నర్‌తింటున్నప్పుడు వేణు సిండీని అడిగాడు "నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నీకు ఇష్టమేనా?" అని.

అతను తనని ఆ మాట అడిగితే బాగుంటుంది అని ఎన్నాళ్ళనించో అనుకుంటున్న సిండీ, ఆనందంతో వెంటనే అంగీకరించింది.

వేణు జేబులోనించి ఉంగరం తీసి ఆమె వేలికి తొడిగాడు. ఆమె వేణు తల ముందుకు వంచి, అతని పెదవుల మీద సుతిమెత్తగా ఒక తీయటి ముద్దుపెట్టింది. ఒక్కక్షణం ఆగి "మరి మా వాళ్ళకీ మీవాళ్ళకీ ఎప్పుడు చెబుదాం" అని అడిగింది.

"వెంటనే" అన్నాడు వేణు.

తర్వాత వచ్చిన శనివారంనాడు సిండీతో పాటు వేణు కూడా హ్యూస్టన్ వెళ్ళాడు. కారు దిగి లోపలికి వెళ్ళగానే తన తల్లిదండ్రులకి అతన్ని పరిచయంచేసింది సిండీ. "ఇతనే వేణు. నేను నిన్న ఫోన్‌లో చెప్పానే అతనే ఇతను. నేను బాగా ఇష్టపడినవాడు. నేనంటే ఇష్టంవున్నవాడు. నేను పెళ్ళి చేసుకోబోతున్న మంచికుర్రాడు" అంది నవ్వుతూ.

వేణుతో ఆండ్రూ, క్రిస్టీన్ చాల స్నేహంగా మాట్లాడారు. వేణు కూడా వాళ్ళతో కలుపుగోలుగా ఎన్నాళ్ళనించో పరిచయస్థుడిలా మాట్లాడాడు.

ఆ రోజు సాయంత్రమే వేణు ఆస్టిన్‌కి వెళ్ళిపోయాడు. సిండీని ఆదివారం సాయంత్రం యూనివర్సిటీలో దించుతానని చెప్పాడు ఆండ్రూ.

ఆ రాత్రి భోజనాల దగ్గర వాళ్ళమ్మ క్రిస్టీన్ని అడిగింది సిండీ. "వేణు గురించి నీ అభిప్రాయం ఏమిటి" అని.

క్రిస్టీన్ ఒక్క క్షణం ఆలోచించి "నాకతను మంచివాడిలాగానే కనపడుతున్నాడు" అన్నది.

"నువ్వేమంటావు" అని అడిగింది ఆండ్రూని.

"మీఅమ్మ అభిప్రాయమే నా అభిప్రాయం. కానీ మంచికుర్రవాడయినంత మాత్రాన సరిపోతుందా. సాంస్కృతికపరంగా, మతపరంగా, మనకీ అతనికీచాల తేడా వుంది. మీ అనుబంధం పెళ్ళి దాకా పోతే, మీ సంసారం సక్రమంగా నడుస్తుందంటావా? ఒకే సంస్కృతిలో పుట్టినవాళ్ళకే ఎన్నో బేధాభిప్రాయాలువస్తుంటే, మీకా సామరస్యం ఎలా వస్తుందనుకుంటున్నారు?" అని సూటిగా అడిగాడు ఆండ్రూ.

సిండీ నవ్వింది. "దానికి జవాబు ఇప్పుడు నువ్వే చెప్పావు డాడీ. ఒకే సంస్కృతిలో, మతంలో ఆ సామరస్యం ఏ కారణాలవల్ల లేకపోయిందో, అదే కారణాల వల్ల

రెండు సంస్కృతులు కలిసినా ఆ సామరస్యం వుండే అవకాశం వుంది కదా!" అన్నది.

సిండీ మాటలు క్రిస్టీన్‌కి అర్థమయినట్టు లేదు. "నేను నీకు ఇచ్చింది ఐస్ టీనా వైనా?" అన్నది.

"ఐస్ టీయే ఇచ్చావు. నేను చెప్పానుగా. ఈ విషయంలో ఒకళ్ళనొకళ్ళు అర్థం చేసుకోవటం ముఖ్యం. అంటే ఆ సామరస్యం అనేది మనసులకీ, వాళ్ళ ప్రవర్తనకీ సంబంధించిన విషయం. ప్రేమ అనేది సార్వజనీనం. సాంస్కృతికపరంగా అయినా, మతపరంగా అయినా ఆ ప్రేమ అనేది ఒక్కటే...."

ఆమె మాట పూర్తి చేయక ముందే ఆండ్రూ అన్నాడు. "అది నువ్వు చెప్పినంత తేలిక కాదు సిండీ. వయసులో వచ్చే ఉద్రేకంలో, ఆ తేడాలు ఇప్పుడు కనపడక పోవచ్చు. కానీ నెమ్మదిగా అవి బయటకు వచ్చే అవకాశాలు వున్నాయి. మీ పెళ్ళి విజయవంతం కాదని నేను అనటం లేదు. అలా జరగాలని కోరుకోవటం లేదు కూడా. విజయవంతం కాకపోవటానికి అవకాశాలు ఎక్కువ అంటున్నాను. అంతే!"

"అవును డాడీ. నువ్వు చెప్పింది నిజమే. కానీ మేము వయసులో వచ్చేఆ ఉద్రేకంతో ఈ నిర్ణయం తీసుకోలేదు. మీరు చెప్పిన ఉద్రేకమెలా వస్తుందో అలానే చల్లబడుతుందని నాకూ తెలుసు. వేణు అమెరికాలోనే పుట్టి, ఈ రెండుసంస్కృతుల మధ్యా పెరిగిన మనిషి. అన్నయ్య జఫ్‌కి ఇక్కడి మన జీవితం మీద ఎంత అవగాహన వుందో వేణుకీ అంతే వుంది"

"మరి ఇండియన్ సంస్కృతి గురించి నీకేం తెలుసు?" అడిగింది క్రిస్టీన్.

పకపకా నవ్వింది సిండీ. "తెలీదు కనకే సంవత్సరం నించీ కష్టపడి తెలుసుకున్నాను. ప్రతి మనిషిలోనూ సంస్కృతిలోనూ మంచీ చెడూ కలిసే వుంటాయి. మంచీ చెడూ కలిస్తేనే ఒక మనిషి అవుతాడు. అలాగే ఈ రెండు సంస్కృతులలోని మంచీ చెడులను గ్రహించి మనకి అనువుగా వాడుకోగలిగితే ఆ జీవితం సుఖంగా వుంటుందని నా నమ్మకం" అన్నది.

ఆండ్రూ ఒక్క క్షణం ఆలోచించి "ఈ వాదనలో నువ్వే గెలిచావనిపిస్తున్నది నాకు" అన్నాడు నవ్వుతూ.

సిండీ కూడా నవ్వి "గెలుపూ ఓటమిల కోసం కాదీ వాదన. మా పెళ్ళికి మీరిద్దరూ మనసారా అంగీకరించటం కోసం. క్రిస్టియన్, హిందు, తూర్పు, పడమర, నలుపు, తెలుపు, ఇవన్నీ మనిషి కల్పించుకున్నవే. మనం కల్పించుకున్న ఈ బేధాలని మనమే రూపు మాపాలి. మనం సృష్టించుకున్న ఈ అంతరాలకు మనమే బానిసలై పోవటం తెలివిగల మనుష్యులుగా మనం చేయవలసిన పనికాదు.." అన్నది.

ఆండ్రూ ఒక్క క్షణం ఆలోచించాడు. నెమ్మదిగా అన్నాడు – "సిండీ! ఈ ప్రపంచంలో నేను బాగా ప్రేమించే వాళ్ళల్లో మొట్టమొదటి స్థానంలో నిలబడేది నువ్వే. అందుకని నువ్వు ఎంత సంతోషంగా వుంటే మాకంత సంతోషం, తృప్తి. నువ్వు అతన్ని గాఢంగా ప్రేమిస్తున్నావని తెలుస్తూనే వుంది. అతనితో జీవితం సుఖప్రదంగా వుంటుందని నీ మనసు నీకు గట్టిగా చెబుతుంటే... అలానే కానీ... నీ సంతోషమే మా సంతోషం..."

సిండీ ఒక్కసారిగా ఆండ్రూని కావలించుకుని, అతని బుగ్గ మీద ముద్దు పెట్టి "థాంక్యూ.. డాడీ.. థాంక్యూ" అన్నది.

అని అంగీకారం కోసం గంభీరంగా వున్న క్రిస్టీన్ వేపు చూసింది.

"అన్ని విధాలా అతనే సరైనవాడని నమ్మకం కుదిరిందా నీకు" క్రిస్టీన్ సూటిగా అడిగింది.

సిండీ అవునని తల వూపింది. ఆమె అందమైన నీలం కళ్ళు ముత్యాల్లాటి కన్నీళ్ళ మధ్య మెరుస్తున్నాయి.

క్రిస్టీన్ సిండీని దగ్గరకు తీసుకుని "నీ సుఖం కన్నా నా కింకేం కావాలి" అన్నది ఆమెను హృదయానికి హత్తుకుంటూ.

బాసింపట్టు వేసుకుని ఆశీనుడయిన సూతుడ్నిచూస్తూ "ఈ సీను బాగానే వుంది కానీ, మరి అనంతరామయ్యగారి సంగతేమిటా అని" అడిగింది నల్లకోతి ఈసారి తెల్లటి పళ్ళు వికిలించకుండా.

"వస్తున్నాను.. వస్తున్నాను.." అని కమండలంలోని నీళ్ళతో గొంతు తడుపుకుని కథ కొనసాగించాడు సూతుడు.

"ఏముంది. జానకిని నిర్మలగారూ రత్నగారూ కనపడినప్పుడల్లా అడుగుతుంటారు – మీ అబ్బాయికి పెళ్ళి చేద్దామనుకుంటున్నారా? మా చుట్టాల్లో మంచి అమ్మాయిలు వున్నారు. వాళ్ళని మీవాడికిచ్చి చేస్తే బాగుంటుందని మాఉద్దేశ్యం అని. వాళ్ళడిగినప్పుడల్లా అనంతరామయ్యతో వేణు పెళ్ళి విషయంకదుపుతూ వుంటుంది జానకి.

"మనదేముంది జానకీ. అంతా వాడి ఇష్టం. వాడు పెళ్ళికి సిద్ధం అంటే... అప్పుడు చూద్దాం"

"అప్పుడు చూడటమేమిటండీ! వేణు మన కొడుకు. వాడికి పెళ్ళిచేసే బాధ్యత మనమీదే వుంది" అన్నది జానకి కోపంగా.

"అవును నిజమే! ఇదే ఇండియాలో ఐతే నువ్వు చెప్పినట్టే చేసేవాళ్ళం. ఇక్కడలా కాదు మరి: ఈ వాతావరణంలో పెరిగిన మనవాడి ఆలోచనలు వేరేగా వుండటం సహజం. వాడికి ఇండియాలో పుట్టి పెరిగిన ఇండియన్ అమ్మాయి కావాలో, అమెరికా

4657
శ్రీకాకుళం



లో పుట్టి పెరిగిన ఇండియన్ అమ్మాయి కావాలో, వేరే ఇంకెవరినైనా పెళ్ళి చేసుకుంటాడో, అసలు పెళ్ళి చేసుకుంటాడో లేదో - వాడు చెబితేనే కదా మనం సహాయం చేసేది" అన్నాడు.

జానకికి ఈసారి బాగా కోపం వచ్చింది. "సహాయం చేయటమేమిటండీ. అది మన బాధ్యత అంటుంటేనూ....." అన్నది కొంచెం గొంతు పెంచి.

అనంతరామయ్య అన్నాడు "నేను ఈ పచ్చినిజాన్ని సూటిగా చెబుతుంటే నీకు నిష్ఠూరం గాను, వినేవాళ్ళకి కొంచెం ఎబ్బెట్టుగానూ వుండవచ్చు. మన ఇష్ట ప్రకారం కాదు మనం చేయవలసింది. వాడి పెళ్ళి వాడిష్ట ప్రకారమే జరుగుతుంది. వేణు ఏ నిర్ణయం తీసుకున్నా మనం మనసా వాచా సమర్ధిద్దాం. కాకపోతే వాడు తీసుకునే నిర్ణయం వాడి భవిష్యత్తుకి ఎంత మంచిదో వాడితోనే చర్చిద్దాం. ఏమంటావ్?"

"ఏమంటాను. ముప్పై ఏళ్ళు అమెరికాలో వుండి మన పద్ధతుల్నీ బాధ్యతల్నీ మరిచిపోతున్నారంటాను"

"మన పద్ధతుల్ని మరిచిపోవటం కాదు, విస్మరిస్తున్నానంటే ఒప్పుకుంటాను. కానీ... బాధ్యతలను కాదు జానకీ. తల్లిదండ్రులుగా వాడిష్ట ప్రకారం చేయటమే మన బాధ్యత. అలానే చేద్దాం. వేణు తెలివైనవాడు. వయసులోనూ ఆలోచనలలోనూ బాగా ఎదిగాడు. చక్కటి నిర్ణయం తీసుకోగల సమర్ధుడు. కాదంటావా?"

జానకి మాట్లాడలేదు. ఆలోచనలో పడింది.

"అంతేకాదు. వేణు ఇష్టానికి వ్యతిరేకంగా మనం పట్టుబట్టి మన ఇష్ట ప్రకారం జరిపించామంటే ఏమవుతుందో తెలుసా? వేణు మనల్ని ఖాతరు చేయకుండా తను చేయదల్చుకున్నది చేస్తాడు. వాడి నిర్ణయానికి అప్పుడెలాగూ కన్నీళ్ళతో తలవంచాల్సిందే. దాని బదులు ముందుగానే వాడి మాటలకు విలువనివ్వటం మనకి మంచిది కాదూ! కనీసం పెళ్ళి చేసుకుంటుంటే చూడటానికన్నా మనకి ఆ అవకాశం వుంటుంది"

అందుకే వేణు సిండీని పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు, జానకి ముందు బిత్తరపోయినా అనంతరామయ్య మాటలు గుర్తుకు తెచ్చుకుని సమర్ధించుకున్నది. వేణు సిండీలు దగ్గరవటం చూసిన అనంతరామయ్య ఈ సందర్భానికి జానకిని ముందుగానే సిద్ధం చేశాడని ఆమెకి తట్టలేదు.

అనంతరామయ్య వేణుని ఒకే ఒకప్రశ్న అడిగాడు. "సిండీతో నీ జీవితం ఆనందమయంగా వుంటుందని గట్టిగా అనుకుంటున్నావా?" అని.

వేణు అవునని నోటితో అన్నా, అతని ముఖంలో ఆ ప్రశ్నకు జవాబు చూసి వెంటనే ఒప్పేసుకున్నాడు అనంతరామయ్య. తర్వాత అనంతరామయ్య ఇంట్లో, సిండీ

వేణులతో సహా అందరూ కలిసి పెళ్ళి విషయాలు మాట్లాడుకున్నారు"

"అంటే కట్నాలూ కానుకలూనా" అడిగాడు చిన్నముని.

శుకమహర్షి తన చిలుకముక్కుతో చిన్నముని భుజం మీద పొడిచి "అమెరికాలో కట్నాలు వుండవు. ఈ రోజుల్లో ఒక్క భారతదేశంలో తప్ప ఈ కట్నాల దురాచారం ఏ సభ్యదేశాల్లోనూ లేదు. అలాటి మాటలు మాట్లాడితే వాళ్ళని మనుష్యులుగా చూడకపోవటమే కాకుండా జైల్లో కూడా వేస్తారు" అన్నాడు.

సూతుడు చిరునవ్వు నవ్వి కథ కొనసాగించాడు.

వేణు సిండీలు హ్యూస్టన్‌లో ఒకే వారంలో రెండుసార్లు పెళ్ళి చేసుకున్నారు. ఒకసారి హిందూ సంప్రదాయం ప్రకారం మీనాక్షి గుడిలోనూ, తర్వాత క్రిస్టియన్ పద్ధతిలో మెథడిస్ట్ చర్చిలోనూ. సిండీ క్రిస్టీన్‌లను రత్న, నిర్మల చీరలు కట్టి అలంకరించారు. పురోహితుడు సంస్కృతంలో చదువుతున్న మంత్రాలను, జరుగుతున్న ప్రతి సంఘటననూ రత్న భర్త కృష్ణమూర్తి ఇంగ్లీష్‌లో వివరిస్తుంటే వాళ్ళందరూ ఎంతో కుతూహలంతో విన్నారు. వేణు సిండీ కలిసి, జానకి పాదాలకు నమస్కారం చేస్తుంటే, జానకి కళ్ళల్లో వాత్సల్యంతో కూడిన మమకారం కన్నీళ్ళ రూపంలో బయటికి వచ్చింది.

సిండీని దగ్గరకు తీసుకునిహృదయానికి హత్తుకుంది జానకి.

తర్వాత మూడోరోజున చర్చిలో క్రిస్టియన్ పద్ధతిలో వివాహం జరిగింది. వేణు అనంతరామయ్య సూట్లు వేసుకుంటే, జానకి మాత్రం పట్టుచీర కట్టుకుంది.

రిసెప్షన్ టైములో, వేణు ముందు సిండీతోనూ, తరువాత కిస్టీన్‌తోనూ, డాన్స్ చేశాడు. అనంతరామయ్య సిండీతో డాన్స్ చేస్తున్నప్పుడు, సిండీ ఆయన కళ్ళల్లోకి కృతజ్ఞతాభావంతో చూస్తూ "థాంక్యూ డాడీ" అంది! ఆండ్రూ జానకి దగ్గరగా వచ్చి నవ్వుతూ నడుము వంచి నమస్కారం చేశాడు .

వేణు సిండీల కుటుంబాల బంధుత్వం చూడముచ్చటగా వుంది. ఒకళ్ళ మతాన్నీ సంస్కృతినీ, ఇంకొకళ్ళు తెలుసుకోటానికి ప్రయత్నించటమేకాక, గౌరవించటం వల్ల బాగా పటిష్టంగా తయారయింది. సిండీ వినాయక చవితి పూజలో ఎలా కూర్చుంటుందో, అలాగే వేణు సిండీ ఆదివారం చర్చికి వస్తావా అంటే వెడతాడు.

"అంటే వాళ్ళకి వేరే సమస్యలు ఏవీ లేవంటారా?" అడిగాడు చిన్నముని అనుమానంగా.

"సంసారమన్న తర్వాత లేకుండా ఎలా వుంటాయి. మానవమాత్రులం. మనకందరికీ ఏవో సమస్యలు వుంటూనే వుంటాయి. వాటిని పరిష్కరించుకుని ముందుకు వెడుతుంటాం. అలాగే వాళ్ళు కూడాను.." అన్నాడు సూతుడు తన ముఖంలో ఎప్పుడూ

చూపించే చిరునవ్వుని మరోసారి చూపిస్తూ.

శౌనకుడు కూడా చిరునవ్వి "సర్వసంగ పరిత్యాగులమైన మన మునులకే సమస్యలు వుండగా, ఆ భౌతిక ప్రపంచంలో బ్రతుకుతున్న వాళ్ళకి సమస్యలు లేకుండా ఎలా వుంటాయి నాయనా!" అన్నాడు.

"అవును.. సమస్యలు లేకుండా.. " అంటున్న చిన్నముని కాలి మీద నల్లచీమ కుట్టటంతో, ఎవరూ చూడకుండా ఒక్కసారిగా దాన్ని చేత్తో నలిపేసి, వేలితో దులిపేసి "అవును. సమస్యలు లేకుండా ఎలా వుంటాయి. వాటిని దులిపేసుకుని ముందుకు పోవటంలోనే వున్నాయి మన తెలివి తేటలు" అన్నాడు, ఎర్రగా కందిన కాలిమీద వేలితో రుద్దుకుంటూ.